క్లుప్తంగా

బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శిగా నాగరాజు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన దండు నాగరాజు బీఎస్పీ నియోజకవర్గ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రవీణ్ సోమవారం నాగరాజుకు నియామకపత్రాన్ని అందించారు. నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గ కార్యదర్శిగా నియామకం కావడం సంతోషంగా ఉందని, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

కొడకండ్ల : స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 8 గంటలకు హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఫ్యామిలి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌నాయక్ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

15న దేవరుప్పులలో..

దేవరుప్పుల : మండల కేంద్రంలోని హైస్కూల్‌లో హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 15న (బుధవారం) మండల స్థాయి ముగ్గుల పోటీ నిర్వహించనున్నారు. పోటీల్లో మండలంలోని 32 గ్రామాల యువతులు పాల్గొని విజయవంతం చేయాలని సభ్యులు కోరారు.

విజేతలకు నగదు అందజేత



నర్మెట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మండల స్థాయి చెస్ పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు మేకల రమేష్ తల్లితండ్రులు మల్లమ్మ-రాజయ్యల జ్ఞాపకార్థం నిర్వహించిన పోటీల్లో 98 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రథమ స్థానంలో అనిల్ కుమార్ (బొమ్మకూర్) రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో పులిరాజు (నర్మెట) రూ.5 వేలు, తృతీయ స్థానంలో రమేష్ యాదవ్ (నర్మెట) రూ. 3 వేలు అందుకున్నాడు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



పాలకుర్తి టౌన్: మండలంలోని బమ్మెర శివారులో మంగళవారం జరిగే ఆలేటి ఎల్లమ్మ జాతర ఏర్పాట్లను వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా క్యూలైన్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, ఆలయ కమిటీసభ్యులు ఉన్నారు.

విరాళం అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌లోని తిరుమలనాథస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించనున్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ రూ.36వేలు విరాళంగా అందించారు. సోమవారం తన జన్మదినం సందర్భంగా సతీష్, సతీమణి సునీత, పిల్లలతో కలిసి పూజారి రామానుజాచార్యులకు అందించారు.

వర్గీకరణకు పాటుపడాలి

బచ్చన్నపేట : సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ వర్గీకరణకు పాటు పడాలని ఎంఎస్పీ జిల్లా కార్యదర్శి పోకాల కుమారస్వామి అన్నారు. సోమవారం మండలంలోని ఆలింపూర్‌లో గ్రామ అధ్యక్షుడు చెల్లాపురం శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 7న జరుగబోయే వేయి గొంతుకలు, లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, రమేష్, సుధాకర్, విజయ్‌కుమార్, నాగరాజు, మధు, రవి, శేఖర్, మల్లేష్, నర్సింహులు, సత్తయ్య, సిద్ధయ్య పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి మాతృవియోగం

బచ్చన్నపేట : మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఆరుగొండ పర్షరాములు తల్లి సిద్దమ్మ(88) సోమవారం మృతి చెందింది. పలువురు నాయకులు మృతదేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్, నల్లనాగుల వెంకటాచారి, గిద్దెల రమేష్, అమృతరెడ్డి, వెంకటేష్, సందీప్ పలువురు ఉన్నారు.

గ్రామాల్లో శునకాల బెడద

- భయాందోళనలో గ్రామస్తులు, విద్యార్థులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్‌తో పాటు మండలంలోని శివునిపల్లి, ఇప్పగూడెం, తాటికొండ, కొత్తపల్లి తదితర చుట్టుపక్కల గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రధానంగా శివునిపల్లి, ఘన్‌పూర్, తాటికొండ గ్రామాల్లో యథేచ్ఛగా రోడ్ల మీద సంచారం చేస్తుండగా గ్రామానికి నూతనంగా వచ్చే వారితో పాటు గ్రామానికి చెందిన పిల్లలు, పెద్దలందరూ వామ్మో కుక్కలంటూ బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో కుక్కలు రోజురోజుకూ విజంభిస్తున్నాయి. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పలుమార్లు కుక్కలదాడిలో గాయపడి పలువురు ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా రోడ్లపై కుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతుండగా ద్విచక్రవాహనదారులకు కుక్కలు అడ్డు రావడంతో ప్రమాదాలు జరిగాయి. కుక్కల భయంతో సాయంత్రం, రాత్రి వేళల్లో బయటికి రావాలంటే పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని, ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కుక్కల సమస్య మరింత తీవ్రతరం కాకముందే పంచాయతీ అధికారులు స్పందించాలని, పూర్తిస్థాయిలో నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తాటికొండలో వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

ఘనంగా గోదాదేవి కల్యాణం

స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లితో, చిల్పూరు, లింగాలఘణపురం,జఫర్‌గఢ్, రఘునాథపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి శ్రీరంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని భోగి పండుగ సందర్భంగా సోమవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి, స్వామివారి కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకులు శాస్త్రోయుక్తంగా పూజలు చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. – సాక్షి, నెట్‌వర్క్



చిల్పూరు: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



జఫర్‌గఢ్ : కూనూర్‌లో..



పాలకుర్తి టౌన్: వల్మిడిలో



లింగాలఘణపురంలో...



స్టేషన్ ఘన్‌పూర్ ఆలయంలో..

క్రికెట్ పోటీలు ప్రారంభం

జఫర్‌గఢ్: సంక్రాంతిని పురస్కరించుకొని ప్రముఖ వ్యాపారి బజ్జూరి మణికాంత్ తండ్రి అశోక్ జ్ఞాపకార్థం మండల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్లయ్య, భిక్షపతి, మోహన్‌రావులతో కలిసి క్రీడా నిర్వాహకులు మణికాంత్ ప్రారంభించారు.

పరామర్శ

చిల్పూరు: మండలంలోని నష్కల్‌కు చెందిన బీజేపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ రఘుపతి నానమ్మ కొమురమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. పార్టీ మండల అధ్యక్షుడు ఉపేందర్‌యాదవ్ పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమని, ఆటగాళ్లు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలని పలువురు వక్తలు అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ దేవరుప్పుల, లింగాలఘణపురం, తరిగొప్పుల, జనగామ, నర్మెట మండలాల్లోని ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్, పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం కలుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి, సీఐలు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీదేవి, డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఆయా పార్టీల నాయకులు, యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతి నిధులు, కౌన్సిలర్లు, నిర్వాహకులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



దేవరుప్పుల : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి



లింగాలఘణపురం : పోటీలను ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి



నర్మెట : క్రికెట్ కీడను ప్రారంభిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి

గ్రామాల్లో ఘనంగా భోగి పండుగ

జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో భోగి పండుగ ఘనంగా జరుపుకున్నారు. సోమవారం తెల్లవారుజామున భోగి మంటలు వేసుకున్నారు. మహిళలు తమ ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. పలు గ్రామాల్లో నిర్వాహకులు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లను పోసి ఆశీర్వదించారు. – సాక్షి, నెట్‌వర్క్



జనగామ : గిర్నిగడ్డలో భోగిమంటలు



జనగామ : బచ్చన్నపేటలో భోగి మంటలు ఆడుతున్న కాలనీ వాసులు



జనగామ : బాలాజీనగర్‌లో..



జనగామ : నెహ్రూపార్కు వద్ద..



జనగామ : ముగ్గులు వేస్తున్న మహిళలు



జనగామ : బాలాజీనగర్‌లో..



జనగామ : చిన్నారికి భోగిపండ్లు పోస్తున్న కుటుంబ సభ్యులు



బచ్చన్నపేట : చిన్నారులపై పండ్లు, పూలు పోస్తున్న చిన్నారులు



నర్మెట : బహుమతులు అందజేస్తున్న అంజయ్య



రఘునాథపల్లిలో..



జనగామ రూరల్ : బహుమతులు ఇస్తున్న శివరాజ్



జఫర్‌గఢ్‌లో భోగి మంటలు



దేవరుప్పుల: ముగ్గు వేస్తున్న చిన్నారి

సంక్షిప్త సమాచారం

అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలి

జనగామ రూరల్ : బాణాపురం ఇందిరమ్మ ఇళ్ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండంలోని ఎల్లంల సిద్దంకి పెదరామచర్ల గ్రామాలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసరమడ్ల స్టేజీ నుంచి హైదరాబాద్ హనుమకొండ రోడ్డు వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్ నిర్మాణంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా సర్వీస్ రోడ్ నుంచి పోవడానికి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. జనగామ నుంచి ఇందిరమ్మ కాలనీ వాసులకు ఏసీ రెడ్డి నగర్ డబుల్‌బెడ్‌రూం వారికి మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు అలాగే ఎల్లంల పెదరామచర్ల సిద్దంకి శ్రీనివాసపురం, పెంబర్తి, ఓబుల్ కేశపురం, పోచన్నపేట, గ్రామాల ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుందని అన్నారు.

పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు

కొడకండ్ల : ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై చింతరాజు హెచ్చరించారు. మండలంలోని మైదంచెరువు తండాకు చెందిన జాటోత్ సరిత నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోపా క్యాలెండర్ ఆవిష్కరణ

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో (గోపా)గౌడ ఆఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్టపురి విజయ్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం గోపా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు.

వైభవంగా మల్లన్న బోనాల చెల్లింపు



చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సోమవారం మల్లన్న బోనాల సందర్భంగా ఒగ్గు పూజారులకు జంగం రవియాదవ్-సరళాదేవి దంపతులు బోనాలు చెల్లించారు. హర్షిణి, ప్రణీత, రాజు, మల్లయ్య, మల్లేష్, ప్రతాపరాజు పాల్గొన్నారు.

నాగులమ్మ ఆలయంలో పూజలు

కొడకండ్ల : మండలకేంద్రంలోని నాగులమ్మ ఆలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, కుసుమ సతీష్‌లు సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించగా ఆలయ కమిటీ పక్షాన సింగరం చంద్రయ్య వారిని సన్మానించారు.

శ్రీమన్నారాయణపురంలో బోనాలు

రఘునాథపల్లి: మండలంలోని శ్రీమన్నారాయణపురంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకొని గౌడ కులస్తులు శ్రీ రేణుకా ఎల్లమ్మ, కంఠమహేశ్వరస్వామి, సురమాంబ దేవతలకు ఘనంగా బోనాలు చేశారు.

రంగాపురం చేరిన శ్రీనివాస్ మృతదేహం

- డిసెంబర్ 24న సౌత్ ఆఫ్రికాలో మృతి
- కన్నీటి వీడ్కోలు పలికిన బంధు,మిత్రులు

కొడకండ్ల : ఇరవై రోజుల నిరీక్షణ తర్వాత సౌతాఫ్రికాలో మృతి చెందిన గౌడుగు శ్రీనివాస్(52) మృతదేహం మండలంలోని రంగాపురం గ్రామానికి చేరగా సోమవారం కుటుంబసభ్యులు. అంత్యక్రియలు నిర్వహించారు. సౌతాఫ్రికాలోని కాంగో లుంబమాస్ నగరానికి వలస వెళ్లి డీఆర్‌సీ పాలిమర్స్ ఎస్‌ఎఆర్‌ఎల్ పీవీసీ పైపుల కంపెనీలో చేరాడు. దురదృష్టవశాత్తు అనారోగ్యం బారిన పడిన డిసెంబర్ 24న మృతి చెందగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆరోగ్యంగా వెళ్లిన వ్యక్తి ఆకస్మాత్తుగా మృతి చెందడంపై కుటుంబసభ్యులు ఆందోళన చెంది 20 రోజులుగా రోదిస్తూ మృతదేహం కోసం నిరీక్షించారు. విషయం తెలుసుకున్న బంధుమిత్రులు వచ్చి వారిని పలకరించి పరామర్శించారు. ఎట్టకేలకు విమానంలో శ్రీనివాస్ మృతదేహాన్ని పంపగా ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌కు రాగా సోమవారం తెల్లవారుజామున రంగాపురం తీసుకొచ్చారు. ఇరవై రోజులకు మృతదేహం ఇంటికి చేరడంతో కుటుంబ సభ్యులంతా బోరున విలపించారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు అంత్యక్రియలు పూర్తయ్యాయి. మృతునికి భార్య సుశీల, కుమారుడు ప్రసన్నకుమార్, కుమార్తె శ్రావణి, తల్లిదండ్రులు గౌరయ్య, సత్తెమ్మలు ఉన్నారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్ (ఫైల్)

మల్లన్న జాతర ప్రారంభం

దేవరుప్పుల : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏటా తలపెట్టే బంజర మల్లన్న జాతర పెద్దమదూరు జోగు బ్రదర్స్ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా ప్రారంభమైంది. గ్రామం నుంచి బంజర శివారులోని మల్లన్న ఆలయం వరకూ ఒగ్గు కళాకారుల ప్రదర్శనతో కుటుంబాల సమేతంగా చేరుకున్నారు. అనంతరం ఆలయం వద్ద బోనం వండి ప్రదక్షిణలతో సమర్పించారు. జాతర నిర్వాహక సభ్యులు జోగు భిక్షపతి మాట్లాడుతూ నేడు (మంగళవారం) కల్యాణం చేయనున్నందున భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సజావుగా కొనసాగేలా తోడ్పాటు అందించాలని కోరారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి సందర్శించి మల్లన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్సై ఊర సృజన్‌కుమార్‌కు సూచించారు. అనంతరం జోగు బ్రదర్స్ పోలీసు అధికారులను ఘనంగా సన్మానించారు.



బంజరలో మల్లన్నకు బోనాలతో ప్రదక్షిణలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాలకుర్తి టౌన్ : మండలంలోని వావిలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ముందుగా తమకు పాఠాలు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం,ఎంఈఓ నర్సయ్య, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంట రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రాణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురి రిమాండ్

రఘునాథపల్లి: మండలంలోని జాఫర్‌గూడెంలో భూ వివాదంలో కర్ని అశోక్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు హత్యాయత్నానికి పాల్పడిన కేసులో సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అనుముల మల్లయ్య తన 17 గుంటల వ్యవసాయ భూమిని 2021లో రూ 9.77 లక్షలకు అశోక్‌కు విక్రయించాడు. ఇందుకు అశోక్ రూ.6 లక్షలు మల్లయ్యకు ఇవ్వగా మరో రూ 3.77 లక్షలు బకాయి ఉంది. మిగతా డబ్బులు రిజిస్ట్రేషన్ చేశాకే ఇస్తానని అశోక్ అగ్రిమెంట్ చేసుకొని భూమి స్వాధీనం చేసుకున్నాడు. మల్లయ్య రిజిస్ట్రేషన్ చేయకపోగా తన భూమి తనకే ఇవ్వాలని అశోక్‌తో పలుమార్లు గొడవకు దిగాడు. ఈ నెల 10న అశోక్ ఆ భూమి దున్నిస్తుండగా మల్లయ్య, అతని కుమారుడు అనుముల రాజు, సోదరులు అనుముల నర్సయ్య, రాములుతో కలిసి అశోక్‌పై పార, గొడ్డలితో దాడి చేశారు. అడ్డువచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ చింత భాస్కర్, కూలీ పనికి వచ్చిన పోచయ్యలపై దాడి చేసి గాయపర్చారు. అశోక్ భార్య కర్ని సుగుణ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.